క్లుప్తంగా

కాంక్రీట్ బల్లలు అందజేత



కాకుమాను: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల(బాలికలు)పాఠశాలకు గ్రామానికి చెందిన దాతలు ఆరి సత్యవతి, జవహర్‌రాణి మంగళవారం నాలుగు సిమెంట్ బల్లలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థినులను చూసేందుకు తల్లిదండ్రులు ప్రతి ఆదివారం వస్తుంటారని, ఆ సమయంలో వారు కూర్చోవడానికి సౌకర్యార్థంగా బల్లలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కె.ఎస్.ఎన్ స్వర్ణకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాకుమాను సొసైటీ చైర్మన్‌గా కోంద్రు అప్పారావు



కాకుమాను: స్థానిక వ్యవసాయ పరపతి సంఘం చైర్మన్‌గా మండలంలోని గరికపాడుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కోంద్రు అప్పారావును నియమిస్తూ మంగళవారం ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. కొద్ది నెలల నుంచి చైర్మన్ పదవి ఖాళీగా ఉండడంతో ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సహకారాలతో అప్పారావును చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చినట్లు ఆయన వెల్లడించారు. త్వరలో చైర్మన్ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యార్థిని హబీబున్నీసాకు పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన విద్యార్థిని సయ్యద్ హబీబున్నీసాకు తమ వర్సిటీ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసిందని వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. ''కాంప్రెహెన్సివ్ ఇన్వెస్టిగేషన్స్ ఆన్ ట్రిటియా టింక్టోరియా సీడ్ ఫైబర్స్ బేస్డ్ సిమెంట్ కాంపోసిట్స్'' అనే అంశంపై ఆమె పరిశోధన చేసిందని తెలిపారు. డాక్టరేట్ పొందిన సయ్యద్ హబీబున్నీసాను పలువురు అభినందించారు.

10 మంది జూదరుల అరెస్ట్

గుంటూరు రూరల్: పేకాట స్థావరంపై దాడి చేసి జూదరులను అరెస్ట్ చేసిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. సీఐ శ్రీనివాసరావు వివరాల మేరకు.. హౌసింగ్ బోర్డు కాలనీలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారం మేరకు దాడి చేయగా పది మంది జూదరులను అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి, కోర్టుకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

దినపత్రిక విలేకరిపై దాడి

చేబ్రోలు: చేబ్రోలు మండలంలోని ఓ దినపత్రిక విలేకరిపై దాడి చేసిన ఘటనలో నిందితుడిని చేబ్రోలు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. వివరాల మేరకు.. ఈ నెల 29న చేబ్రోలు సెంటర్‌లో ఉన్న విలేకరి రెడ్డి గంగాధర్‌పై చేబ్రోలుకు చెందిన మార్నెళ్ల వెంకటేశ్వరరావు అనే వ్యక్తి దాడి చేసి, గాయపరిచాడు. ఈ దాడిలో రెండు చేతులకు గాయాలయ్యి.. గంగాధర్ గుంటూరులోని వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. అతని ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కె.ఆనంద్ మార్నెళ్ల వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసి, కోర్టుకు హాజరుపరిచినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వలంటీర్ మృతి



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ లారీ ఢీ కొట్టడంతో గ్రామ వలంటీర్ అక్కడికక్కడే మృతి చెందిన ఘటన పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. మండల పరిధిలోని తాళ్లపాలెం గ్రామానికి చెందిన చుండూరు వీర మణికంఠ వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తన ద్విచక్ర వాహనంపై బాపట్లకు వెళ్తున్న మార్గమధ్యలో చింతలపూడి పెట్రోలు బంకు వద్ద అతనిని లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మణికంఠ మృతి చెందాడు. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. పాతగుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఇజ్రాయిల్‌పేటకు చెందిన గూడూరు రాజేష్ (24) కు గత ఐదు సంవత్సరాల క్రితం రమ్యతో వివాహమైంది. దంపతుల మధ్య వివాదాలు జరుగుతుండటంతో భార్య రమ్య పుట్టింటికి వెళ్లిపోయింది. ఈనేపథ్యంలో మనస్తాపానికి గురైన రాజేష్ మంగళవారం నివాసంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి దావీదు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దేశమంతా ఏపీ వైపు చూసేలా 'ఫ్యామిలీ ఫిజీషియన్'

- అన్ని విభాగాల సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి
- ఇష్టమొచ్చినట్లు నివేదికలు ఇస్తే కుదరదు
- సమీక్ష సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎ. శ్రావణ్‌బాబు



సమీక్షిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎ. శ్రావణ్‌బాబు, మన్మోహన్

ప్రత్తిపాడు: దేశమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూసేలా రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎ. శ్రావణ్‌బాబు అన్నారు. ప్రత్తిపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం గొట్టిపాడు పీహెచ్‌సీ పనితీరుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా డీఎంహెచ్‌వోతో పాటు డీసీహెచ్‌ఎస్ డాక్టర్ జె.హనుమంతరావు పాల్గొన్నారు. మాతృ మరణాలు, గర్భిణుల వివరాల నమోదు, కాన్పులు, హైరిస్క్ చిన్నారుల నమోదు.. హాజరు.. వంటి పలు అంశాలపై హెల్త్ వెల్‌నెస్ సెంటర్ల వారీగా సమీక్షించారు. పనితీరు సక్రమంగా లేని ఆరోగ్య సిబ్బందిని మందలించడంతో పాటు నూటికి నూరు శాతం పనితీరు కనబరిచిన ఏఎన్‌ఎంలను పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందించారు. జిల్లా వైద్యారోగ్యశాఖలోని అన్ని విభాగాల అధికారులు మండల స్థాయికి వచ్చి, గ్రామ స్థాయి వరకూ రివ్యూ నిర్వహించడం ఇదే మొదటిసారి.

ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు అయ్యేలా ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆశ కార్యకర్త నెలకు కచ్చితంగా ఒక్క ప్రసవం అయినా సామాజిక ఆరోగ్య కేంద్రంలో అయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆశలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు సమన్వయంతో పని చేస్తేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందడంతో పాటు వైద్య రంగంలో ప్రగతి సాధ్యపడుతుందన్నారు. చిత్తశుద్ధితో పనిచేస్తే ప్రత్తిపాడు సీహెచ్‌సీని ఏరియా ఆస్పత్రిగా మార్చుకునేందుకు వీలు ఉంటుందని శ్రావణ్‌బాబు మార్గనిర్దేశం చేశారు. డీసీహెచ్‌ఎస్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రత్తిపాడు సీహెచ్‌సీలో గతంలో కన్నా ఇప్పుడు మెరుగ్గా అన్ని విభాగాలకు స్పెషలిస్టు వైద్యులు ఉన్నారన్నారు. గైనిక్, మత్తు, జనరల్ ఫిజీషియన్, చిన్నపిల్లల వైద్యులు.. ఇలా అందరి సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్పత్రిలో ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు వైద్యులందరూ విధుల్లో ఉంటారని, ఒక వైద్యాధికారి ఆస్పత్రిలోనే డ్యూటీలో ఉంటారని స్పష్టం చేశారు. డీపీవో డాక్టర్ రత్నమన్మోహన్ మాట్లాడుతూ క్షేత్రస్థాయి నుంచి నివేదికలను పక్కాగా జిల్లా కార్యాలయానికి పంపాలన్నారు. నోటికొచ్చిన అంకెలు వేసి, నివేదిక పంపడం మానుకోవాలని హితవు పలికారు. నివేదికల విషయంలోనూ, పనితీరులో అలసత్వాన్ని ఎలాంటి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎంవో సుబ్రమణ్యన్, డీఎల్‌వో సుబ్బారావు, ఎఫ్‌పీసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ, డీపీహెచ్‌ఎన్‌వో అన్నపూర్ణమ్మ, ప్రత్తిపాడు సీహెచ్‌సీ, గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

త్రీడీ టెక్నాలజీతో భవనాల నిర్మాణం సులభం

వీవీఐటీలో 3డీ ప్రింటింగ్స్ ఆఫ్ కాంక్రీట్ బిల్డింగ్స్‌పై అవగాహన

పెదకాకాని: 3డి ప్రింటింగ్స్ కాంక్రీట్ వలన తక్కువ సమయంలో, తక్కువ ఖర్చు, అధిక నాణ్యతతో నిర్మాణాలు చేపట్టవచ్చని ఐఐటీ(ముంబాయి) ప్రొఫెసర్ డాక్టర్ నజీబ్ షరీఫ్ మహ్మద్ తెలిపారు. పెదకాకాని మండలంలోని నంబూరు వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని సివిల్ విభాగం, నిర్మాణ దక్ష విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 3డీ ప్రింటింగ్ ఆఫ్ కాంక్రీట్ బిల్డింగ్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. నజీబ్ షరీఫ్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ భారీ యంత్రాల సహకారంతో 3డీ ప్రింటింగ్ ద్వారా విస్తృత శ్రేణి భవనాలను సులభంగా నిర్మించవచ్చన్నారు. నిర్మాణ రంగంలో యువతకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకోవడం ద్వారా మెరుగైన అవకాశాలు పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ అడ్మిన్ డాక్టర్ ఎన్.కుమార స్వామి, సివిల్ విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

నేడు టేక్ హోమ్ రేషన్ కిట్లు పంపిణీ

పెదకాకాని: గర్భిణులకు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ కిట్ పంపిణీ కార్యక్రమం బుధవారం నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సత్యవతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టేక్ హోమ్ రేషన్ (టీహెచ్‌ఆర్) కిట్‌లో 3 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, 500 గ్రాములు ఆయిల్, 13 గుడ్లు, 2.5 లీటర్ల పాలు ఉంటాయని చెప్పారు. ఎప్పటి మాదిరిగానే రాగిపిండి రెండు కిలోలు, అటుకులు కిలో, బెల్లం 250 గ్రాములు, ఖర్జూరం 250 గ్రాములు, చిక్కీలు 250 గ్రాములు టీహెచ్‌ఆర్ కిట్‌తో పాటు ఇవ్వడం జరుగుతుందన్నారు. అదనంగా 15 రోజుల తరువాత 12 గుడ్లు, 2.5 లీటర్ల పాలు గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేయడం జరుగుతుందని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించిన అనంతరం.. పెదకాకాని మండల పరిషత్ కార్యాలయంలో బాలింతలకు, గర్భిణులకు టీహెచ్‌ఆర్ కిట్‌లు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.

అలరించిన టెక్నో ఎగ్జిబిషన్



గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల ఆధ్వర్యంలో మంగళవారం టెక్నో ఎగ్జిబిషన్ నిర్వహించారు. నగర శివారులోని లాంఫాం నందున్న కళాశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ చైతన్యకుమారి ముఖ్య అతిథిగా విచ్చేసి, ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇటువంటి వైజ్ఞానిక సదస్సులు ఎంతో దోహదపడతాయన్నారు. డాక్టర్ ప్రసూన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి నైపుణ్యత కలిగిన విద్యను అందిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు కృషిచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ విత్తన పథకంపై శిక్షణ



రైతు శిక్షణలో మాట్లాడుతున్న ఏడీఏ హైమావతి

పెదకాకాని: గ్రామ విత్తన పథకం ద్వారా తీసుకున్న విత్తనాలను సూడోమోనాస్‌తో విత్తనశుద్ధి చేసి, వెదపెట్టడం ద్వారా మొదటి 30 రోజులు తెగుళ్ల ఆశించకుండా ఉంటుందని ఏడీఏ హైమావతి తెలిపారు. మండలంలోని గోళ్లమూడి గ్రామంలో పథకం ద్వారా వరి ఫౌండేషన్ విత్తనాలను తీసుకున్న 30 మంది రైతులకు మొదటి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఏఓ పి.సంధ్యారాణి శిక్షణా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఏడీఏ హైమావతి మాట్లాడారు. విత్తనం మొలక కట్టుకుని ఎకరానికి 12–15 కిలోల వరకు వెదపెట్టాలన్నారు. విత్తనాల కోసం తిరగాల్సిన పనిలేకుండా.. మన విత్తనాన్ని మనమే పండించుకోవచ్చన్నారు. నాణ్యమైన విత్తనాన్ని గ్రామంలో రైతులకు అందుబాటులో పెట్టడమే విత్తన పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. పొలంబడి, భూసార పరీక్షల ప్రయోజనాలను వివరించి, సిఫార్సు చేసిన ఎరువులు మాత్రమే వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నడింపల్లి కోటేశ్వరమ్మ, ఏఈఓ శివాజీ, వీపీఏలు జ్యోత్స్న, విజయలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే తలమానికంగా ఎంసీహెచ్ వార్డు



డాక్టర్ పట్టాభిరామన్‌తో కలిసి ఎంసీహెచ్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో ప్రభుత్వ సహకారంతో గుంటూరు వైద్య కళాశాల పూర్వ వైద్య విద్యార్థులు జింఖానా పేరుతో సుమారు రూ.80 కోట్లతో నిర్మిస్తున్న మాతా శిశు సంరక్షణ కేంద్రం ఏపీలోనే తలమానికంగా నిలుస్తోందని జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. మంగళవారం జింఖానా కార్యదర్శి, 1983 బ్యాచ్‌కు చెందిన డాక్టర్ సామినేని పట్టాభిరామన్ ఎంసీహెచ్ వార్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే ఎంసీహెచ్ వార్డు రెండు ఫ్లోర్లు పూర్తి కావచ్చాయని, మరో నాలుగు ఫ్లోర్ల నిర్మాణ పనులు వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా పూర్తి చేస్తామన్నారు. డాక్టర్ పట్టాభిరామన్ మాట్లాడుతూ ఎంసీహెచ్ వార్డు నిర్మాణాన్ని వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ గోవిందనాయక్, డాక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు.

లేఅవుట్ల ఏర్పాటులో నిబంధనలు పాటించాలి

నగర కమిషనర్ చేకూరి కీర్తి



అపార్ట్‌మెంట్ కొలతలు పరిశీలిస్తున్న కమిషనర్ చేకూరి కీర్తి

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రైవేట్ వెంచర్లు, లే అవుట్లు తగిన అనుమతులతోనే ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే పట్టణ ప్రణాళిక అధికారులు తొలగింపు చర్యలు తీసుకుంటారని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. మంగళవారం కాకాని రోడ్డులో అనుమతి కోసం దరఖాస్తు చేసుకున్న లే అవుట్, నందివెలుగు రోడ్‌లో ఆక్యుపెన్సీ కోసం దరఖాస్తు చేసిన అపార్ట్‌మెంట్‌ను తనిఖీ చేసి తదుపరి అనుమతులపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ వెంచర్లు అనుమతి లేకుండా ఏర్పాటు చేస్తే సంబంధిత ప్లానింగ్ కార్యదర్శి, పట్టణ ప్రణాళిక అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంచర్ల రోడ్ వైడెనింగ్ పోర్షన్, అంతర్గత రోడ్ల వెడల్పు, ప్లాట్ల కొలతలు, మార్ట్‌గేజ్ ప్లాట్లు, యుటిలిటీ ఏరియా, ఎమినిటీస్ ఏరియా, ఓపెన్ స్పేస్, గ్రీనరీ, డ్రైన్ల ఏర్పాటుపై వివరాలు అడిగి తెలుసుకొని నేరుగా తనిఖీ చేశారు. అనంతరం పట్టణ ప్రణాళిక అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే వెంచర్లకు అనుమతులు ఇవ్వాలని, తుది అనుమతుల కోసం తమకు పంపే ముందే ప్రణాళిక అధికారులు సదరు వెంచర్లను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ నిర్దేశిత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు లేని వెంచర్లకు అనుమతులు మంజూరు చేయబోమన్నారు. అదేవిధంగా నిబంధనల మేరకు మాత్రమే నగరంలో బహుళ అంతస్తు భవనాలు నిర్మాణాలు జరగాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే తగిన చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఎల్.టి.పి.లు నూతనంగా బహుళ అంతస్తు భవనాలకు అనుమతుల కోసం ఆన్‌లైన్ ద్వారా డీపీఎంఎస్‌లో తప్పనిసరిగా నిర్దేశిత ధ్రువపత్రాలు అప్‌లోడ్ చేయాలని, లేకుంటే తదుపరి అనుమతులను నిలిపివేయడం జరుగుతుందన్నారు. సెట్ బ్యాక్ పోర్షన్‌లో, రోడ్ వైడెనింగ్ పోర్షన్‌లో ఎటువంటి నిర్మాణం చేసినా, నిర్ణీత ఎత్తు మించినా కూడా ఆక్యుపెన్సీ మంజూరు చేయబోమన్నారు. ఈ పర్యటనలో డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, ఏసీపీ బాబురావు, టీపీబీఓ రసూల్, సచివాలయ ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంట్లోని బ్యాగు చోరీ

గుంటూరు ఈస్ట్: ఇంట్లో బ్యాగు చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదుచేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బృందావన్ గార్డెన్స్ నాల్గోలైనులో నివాసం ఉండే షేక్ జాకియా హ్యాండ్ బ్యాగును ఇంట్లోని టేబుల్‌పై ఉంచింది. రెండో రోజు చూడగా బ్యాగు కనిపించలేదు. అందులోని పది గ్రాముల బంగారం, రూ. 2వేలు నగదు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి

గుంటూరు ఈస్ట్: ఐదుగురు యువకులు మహిళపై దాడిచేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రమణ అనే మహిళ పాత పరిచయం నేపథ్యంలో శివనాగరాజు కాలనీలో క్రాంతి ఇంటికి వెళ్లింది. అయితే క్రాంతి, సన్ని, మణిరెడ్డి, వంశీ, నవీన్‌లు రమణపై దాడిచేసి, ఆమె ద్విచక్రవాహనాన్ని ధ్వంసం చేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి

గుంటూరు ఈస్ట్: బాలికపై జరిగిన లైంగికదాడి ఘటనలో పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. సేకరించిన సమాచారం మేరకు.. 15 సంవత్సరాల వయస్సు గల బాలిక ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన యువకుడితో స్నేహంగా మెలిగింది. యువకుడు బాలికను ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసినట్లు సమాచారం.

ధూళిపాళ్లకు ఎలా సమాధానం చెప్పాలో తెలుసు

- పొన్నూరు అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు
- పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

చేబ్రోలు: పొన్నూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక, అబద్ధాలతో టీడీపీ మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మండిపడ్డారు. అభివృద్ధిని అడ్డుకుంటున్నారని విమర్శించారు. పొన్నూరు పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడారు. రోడ్డు విస్తరణ పనులపై ధూళిపాళ్ల సంబంధం లేని భవనం గురించి మాట్లాడుతూ ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. 'నువ్వు ఎంత అలైన్మెంట్ పెట్టావో అంత వరకే పరిమితం చేసి, వారికి నోటీసులు ఇచ్చాం. 25 సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసి, నియోజకవర్గ ప్రజల్ని మోసం చేసుకుంటూ వచ్చావు' అంటూ ఎమ్మెల్యే ధూళిపాళ్లపై మండిపడ్డారు. ధూళిపాళ్ల చరిత్ర మొదలుపెడితే చాటభారతం అంత అవుతుందని అన్నారు. పొన్నూరు సాక్షి భావన్నారాయణ స్వామి మీద ఉన్న భక్తితో ఆయన పాదాల వద్ద నామినేషన్ పత్రాలు ఉంచి, నామినేషన్ వేశానని సెంటిమెంట్‌తో ఆలయం అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో మాత్రమే తన భార్యను అక్కడ మెంబరుగా ఉంచానన్నారు. భవన యజమానులను భయ పెట్టామని ఒక్కరి చేత అయినా చెప్పించాలని కిలారి సవాల్ విసిరారు. జీబీసీ రోడ్డు విస్తరణ, ఆటోనగర్, చేబ్రోలు కొమ్మమూరు బ్రిడ్జి నిర్మాణం ఈ పనులన్నీ పూర్తిచేస్తానని, వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తే ఏ రకంగా సమాధానం చెప్పాలో అలా చెప్తానని ధూళిపాళ్లను ఎమ్మెల్యే రోశయ్య హెచ్చరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల, స్టేట్ ఇరిగేషన్ బోర్డు డెవలప్‌మెంట్ డైరెక్టర్ దాసరి నారాయణరావు, మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైపుల్లా, జిల్లా వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు షేక్ మొహమ్మద్ (మాము), పెరికల కృష్ణమోహన్, సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు గ్రామాల సమస్యకు దొరికిన పరిష్కారం



డొంకను పరిశీలిస్తున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

కాకుమాను: మండలంలోని కాకుమాను, చిన కాకుమాను గ్రామాలను అనుసంధానం చేస్తూ.. ఉన్న డొంక సమస్యకు త్వరలో పరిష్కారం లభించనుంది. ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత సహకారంతో డొంక అభివృద్ధికి పనులను చేపట్టనున్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వ్యవసాయ సలహా కమిటీ జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ డొంకను పరిశీలించి, సర్వే చేయించారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాతూ.. కాకుమాను నుంచి చిన కాకుమానుకు వెళ్లే డొంక అధ్వానంగా ఉండడంతో రెండు గ్రామాల ప్రజలు, ముఖ్యంగా కాకుమాను ఎస్సీ కాలనీ వాసులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎస్సీ కాలనీ వాసుల శ్మశాన వాటికకు ఈ డొంక మార్గం కావడంతో.. వర్షాల సమయంలో అంతిమయాత్రలకు అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ సమస్యను ఎమ్మెల్యే మేకతోటి సుచరిత దృష్టికి తీసుకువెళ్లడంతో.. వెంటనే సర్వే చేయించి, నివేదిక అందజేయాలని ఆమె సూచించారని వెల్లడించారు. డొంక అభివృద్ధిలో భాగంగా సుమారు కిలోమీటరు వరకు సీసీ రోడ్డు, మూడు కిలోమీటర్ల వరకు గ్రావెల్ రోడ్డును వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, తహసీల్దారు జె.ప్రసాదరావు, ఎంపీడీఓ రామకృష్ణ, పీఆర్ ఏఈ ఆనందరావు, పంచాయతీ కార్యదర్శి పూర్ణయ్య, గ్రామ సర్వేయర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

'చలపతి ఫార్మసీ'లో చిత్రలేఖన పోటీలు



బహుమతులు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపల్ రామారావు

గుంటూరు రూరల్: ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని చలపతి ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అన్నారు. నగర శివారులోని లాం నందున్న కళాశాలలో మంగళవారం ప్రపంచ ఊపిరితిత్తుల క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా క్విట్ స్మోకింగ్ అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మరణానికి దారితీసే వ్యాధుల్లో క్యాన్సర్ రెండవ స్థానంలో ఉందన్నారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ అనేది అత్యంత ప్రమాదకరమైందని తెలిపారు. చిత్రలేఖనం పోటీల్లో మొత్తం 78 మంది విద్యార్థులు పాల్గొనగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఐదుగురుకి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థి అస్వస్థతకు గురైన సంఘటనపై విచారణ

- పాఠశాలకు వెళ్లి విచారించిన డీఈఓ శైలజ
- బాధ్యులైన హెచ్‌ఎం, పీఈటీ సస్పెన్షన్



జీజీహెచ్ క్యాజువాల్టీలో విద్యార్థి లాల్ అహ్మద్‌ను పరామర్శిస్తున్న డీఈఓ శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: కాలం చెల్లిన ఐరన్ ట్యాబ్లెట్లు మింగి తీవ్ర అనారోగ్యానికి గురైన విద్యార్థి లాల్ అహ్మద్‌ను మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ పరామర్శించారు. అదే సమయంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు ఫోన్ చేసి విద్యార్థికి మెరుగైన చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థి లాల్ అహ్మద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నారని డీఈఓ శైలజ చెప్పారు.

పాఠశాలకు వెళ్లి విచారణ..

డీఈఓ శైలజ ఆర్.అగ్రహారంలోని కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలకు వెళ్లి జరిగిన సంఘటనపై విచారణ జరిపారు. ఏఎన్‌ఎంలు ఇచ్చిన ట్యాబ్లెట్లను పరీక్షించకుండా నేరుగా విద్యార్థులకు పంపిణీ చేసిన సంఘటనపై పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరెడ్డిని ప్రశ్నించారు. విద్యార్థి తండ్రి అబ్దుల్ హనీఫ్‌తో మాట్లాడారు. డీఈఓ వెంట డీవైఈఓ వి.వెంకటేశ్వరరావు ఉన్నారు. సంఘటనకు బాధ్యులను చేస్తూ కావటి శంకరరావు నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డితో పాటు పీఈటీ శిరీషారాణిని సస్పెండ్ చేశారు.

యువకుల మధ్య ఘర్షణపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ముగ్గురు యువకులపై ఐదుగురు యువకులు దాడిచేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శారదా కాలనీ 15వలైనులో సన్ని, క్రాంతి, మణిరెడ్డి, వంశీ, నవీన్‌లు రోడ్డుకు అడ్డుగా ద్విచక్రవాహనాలు నిలబెట్టి మాట్లాడుకుంటున్నారు. శివనాగరాజు, వెంకట్రావు, శరత్‌కుమార్‌లు రోడ్డుకు అడ్డుగా ఉన్న ద్విచక్రవాహనాలు తీయాలని కోరారు. ఈ విషయమై ఘర్షణ జరిగింది. ఐదుగురు యువకులు, ముగ్గురు యువకులపై దాడిచేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న సినీ సంగీత విభావరి

పాతగుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజ ఆడిటోరియంలో ఈనెల 6వ తేదీన మధుర గాయకుడు రామకృష్ణ ఆణిముత్యాలు పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నట్లు శ్రీశుభాంజలి కళావేదిక అధ్యక్షుడు మేకల పురుషోత్తమ ప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.